సాక్షి ఆదిలాబాద్

సోమవారం, 4, నవంబర్, 2024



యూఏఈ.. మరో అవకాశం

అక్రమ వలసదారుల వీసాల క్రమబద్ధీకరణకు యూఏఈ రెండు నెలల గడువు పొడిగించింది. డిసెంబర్ చివరి నాటికి క్షమాభిక్ష వర్తిస్తుంది. 8లో ▸



గుండెలదురుతున్నాయ్..

హృద్రోగ, కాలేయ సమస్యలు పెరిగిపోతున్నాయి. 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వారి మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపించనుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి ఉషు పోటీలకు ఎంపిక



తండ్రి లింగన్నతో విప్లవ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన చాక్కలి లింగన్న–నవీన దంపతుల కుమారుడు విప్లవ్ ఉషు అండర్–19 రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాడు. ఇటీవల మహబూబాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. విప్లవ్‌ను గ్రామస్తులు, క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందించారు.

సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు



కెనాల్‌ను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

కైలాస్‌నగర్: రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సాత్నాల ప్రాజెక్ట్ డీఈ శ్రీనివాస్ అన్నారు. యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి ఇచ్చిన వినతిపత్రానికి స్పందించిన ఆయన ఆదివారం జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. గేట్లు ఎత్తి కెనాల్‌కు నీళ్లు వదిలారు. కెనాల్‌లో ఎక్కడెక్కడ పూడిక తీయాల్సి ఉందనే దానిపై రైతులతో కలిసి పరిశీలించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాగునీరు అందించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట నాగరాజు, కిరణ్ తదితరులున్నారు.

5న జోనల్‌స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్–14, 17 జోనల్‌స్థాయి బాలుర కబడ్డీ ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని రెసోనెన్స్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు, పోటీల కన్వీనర్ డైరెక్టర్ ప్రమోద్‌రెడ్డి తెలిపారు. అర్హులైన క్రీడాకారులు, వయస్సు ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్‌తో ఈనెల 5న ఉదయం 9 గంటలకు పాఠశాల పీఈటీ వినోద్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 9866628928 నంబర్లో సంప్రదించాలని కోరారు.



పత్తి (ఫైల్)

ప్రైవేట్‌దే పెత్తనం

- తేమ పేరిట సీసీఐ కొర్రీలు
- కొందరికే అందుతున్న 'మద్దతు'
- మార్కెట్‌లో చిత్తవుతున్న పత్తి రైతు

ఇప్పటివరకు పత్తి కొనుగోళ్ల వివరాలు..
సీసీఐ కొనుగోలు చేసిన పత్తి : 7,176క్వింటాళ్లు
ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తి : 32,745 క్వింటాళ్లు

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఇప్పటివరకు 56 మంది రైతులకే లభించింది. సీసీఐకి 9 శాతం తేమతో 50 మంది, 10 శాతం తేమతో 105 మంది, 11 శాతం తేమతో 72 మంది, 12 శాతం తేమతో 99 మంది విక్రయించారు. ఇదిలా ఉండగా జిల్లాలో ఈ ఏడాది 4లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. 30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

56 మందికే 'మద్దతు'..

అయితే ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో పూత, కాత రాలిపోయింది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పత్తి ఎకరానికి 8 క్వింటాళ్లకు మించడం లేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు కూలీలకు డబ్బులు చెల్లించాల్సి ఉండడంతో చేతికొచ్చిన పంట దిగుబడిని అగ్గువకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రైవేట్‌లో క్వింటాలుకు రూ.7వేలు కూడా రావడం లేదని వాపోతున్నారు. వాహనం అద్దె, తదితర ఖర్చులు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులదే పెత్తనం కొనసాగుతోంది. ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ అది కొంత మంది రైతులకు మాత్రమే లభించగా, మిగతా వారంతా తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి. ఆరుగాలం కష్టపడి పంట పండించిన పత్తి రైతులకు చివరికి కన్నీళ్లే మిగులుతున్నాయి. ఏటా ఏదో విధంగా నష్టపోతూనే ఉన్నారు. సీసీఐ తేమ పేరిట కొర్రీలు పెట్టడంతో గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పంట ఏరేందుకు కూలీల ఖర్చు, సాగుకు తెచ్చిన అప్పులు చెల్లించాల్సి ఉండటంతో దిగుబడిని ఇంట్లో నిల్వచేసుకోలేక ఆదరబాదరగా అమ్ముకుంటున్నారు. సీసీఐ రంగంలో ఉన్నప్పటికీ నిబంధనలు వారి పాలిట శాపంగా మారుతున్నాయి.

గత్యంతరం లేని పరిస్థితిలో..

సీసీఐ అధికారులు 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే మార్కెట్లో పత్తి కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి అందినకాడికి దండుకునే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సీసీఐ మద్దతు ధర రూ.7,521 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.7,100తో కొనుగోలు చేస్తున్నారు. ఇందులో తేమ పేరిట కోత విధించడంతో ఒక్కోరైతుకు క్వింటాలుకు రూ.6,500 నుంచి రూ.7వేల వరకు మాత్రమే ధర లభిస్తుంది. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గతనెల 26న పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. నాలుగు రోజులు మాత్రమే కొనసాగాయి. సీసీఐ ఇప్పటివరకు 382 మంది రైతుల వద్ద కేవలం 7,176 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయగా, ప్రైవేట్ వ్యాపారులు 1,779 మంది రైతుల నుంచి 32,745 క్వింటాళ్ల కొనుగోలు చేయడం గమనార్హం. ఇప్పటివరకు ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మొత్తం 39,921 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా రైతులకు అవగాహన లేక కొంత మంది తేమ శాతం 8 ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకున్నారు. 561 మంది రైతులు క్వింటాలుకు రూ.7,130తో విక్రయించుకొని నష్టపోవాల్సి వచ్చింది. అలాగే 9 శాతం తేమతో 80 మంది రైతులు, 10 శాతం తేమతో 214 మంది రైతులు, 11 శాతం తేమతో 330 మంది రైతులు, 12 శాతం తేమతో 329 మంది రైతులు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోయారు. అవగాహన కల్పించాల్సిన మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పెట్టుబడి కూడా వెళ్లని పరిస్థితి..

సరైన దిగుబడి రాక పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు పెట్టుబడి ఎకరాకు రూ.40వేల వరకు అయినట్లు చెబుతున్నారు. మరోవైపు వర్షాల వల్ల పంట దెబ్బతినడంతో ఎకరాకు 8 క్వింటాళ్లు కూడా దిగుబడి రావడం లేదని, పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. సాగుకు తెచ్చిన అప్పులు కూడా తీరే పరిస్థితి లేదని చెబుతున్నారు. క్వింటాలు ధర రూ.8వేలనుంచి రూ.10వేల వరకు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని పేర్కొంటున్నారు.

ఎండబెట్టి తీసుకొస్తే మద్దతు ధర



పత్తిని ఎండబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకొని నష్టపోవద్దని తెలియజేస్తున్నాం. ఇప్పటివరకు ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో 39,921 క్వింటాళ్ల పత్తి విక్రయాలు జరిగాయి. ఇందులో సీసీఐ 7,176 క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారులు 32,745 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. దీపావళి సందర్భంగా మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిపివేయగా, సోమవారం నుంచి మళ్లీ ప్రారంభిస్తున్నాం.

– మధుకర్, మార్కెట్ కార్యదర్శి, ఆదిలాబాద్

బోగస్ ఎల్ఆర్ఎస్ కేసులో..

కదులుతున్న డొంక



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

- ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్ట్
- పరారీలో మరో ముగ్గురు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం ఖుర్షాపూర్ శివారు పరిధి రణదీవేనగర్‌లోని సర్వేనంబర్ 64/2/3/2 లేఅవుట్‌ను నకిలీ ఎల్ఆర్ఎస్ డాక్యుమెంట్‌తో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో డొంక కదులుతోంది. ఫోర్జరీ సంతకాలతో అనుమతులు ఉన్నట్లుగా సృష్టించి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారాన్ని 'నకిలీ ఎల్ఆర్ఎస్‌తో రిజిస్ట్రేషన్' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించారు. బోగస్ ఎల్ఆర్ఎస్ సృష్టించి తమను తప్పుదోవ పట్టించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ ఆదిలాబాద్ రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు రంగంలోకి దిగిన రూరల్ పోలీసులు బాధ్యులైన డాక్యుమెంట్ రైటర్ ముషీర్ ఖాన్‌తో పాటు కుమేస్ అహ్మద్, ఎండీ.అజీమ్, అనంత్‌కుమార్ సామ్‌నానీ, ఎండీ.నవీద్ అనే ఐదుగురిపై చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేశారు. ఏ1గా ఉన్న ఎండీ.అజీమ్, ఏ2 ఎండీ.కుమేసీ అహ్మద్‌ను ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న మరో ముగ్గురిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇందులో రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సై ముజాయిద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నకిలీ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ రద్దు కావడంతో ఆ లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులు లబోదిబోమంటున్నారు. తాము చెల్లించిన సొమ్మును నిందితుల నుంచి రికవరీ చేయించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలపై తమ సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం అన్నారు. టీయూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా లచ్చిరాంతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుజాత వ్యవహరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్, జలందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా జాదవ్ బలరాం, ఆర్థిక కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా అంజనాదేవి, ప్రఫుల్‌చందర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సూచించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

టీయూటీఎఫ్ ఆరో రాష్ట విద్యా మహాసభలను జయప్రదం చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 10, 11 తేదీల్లో జిల్లా కేంద్రంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలేందర్ రెడ్డి, భూమన్న, మధుసూదన్‌రెడ్డి, అరుణ, సుజాత, జాదవ్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్–14, 17 బాలబాలికల జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో ఆదివారం ఉత్సాహంగా సాగాయి. పోటీలను జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, పెటా జనరల్ సెక్రెటరీ ఎస్.స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెస్ క్రీడతో ఏకాగ్రతతో పాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 5న మంచిర్యాలలో నిర్వహించనున్న జోనల్‌స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇందులో పోటీల కన్వీనర్, ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఆర్గనైజర్ హరీశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కులగణన విధులు టీచర్లందరికీ కేటాయించాలి

ఆదిలాబాద్‌టౌన్: కులగణన విధులు ఉపాధ్యాయులందరికీ కేటాయించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్‌చౌహాన్, వలభోజు గోపీకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం భీంపూర్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కుల గణన విధులు కేవలం ప్రాథమిక పాఠశాలలకు కేటాయించడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అన్ని విభాగాలతో ఒకే రోజు సమగ్ర సర్వే చేశారని, ఈసారి కూడా ఆ విధంగానే చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రోజు విజయసారధి, ప్రధాన కార్యదర్శిగా తలార్ల శ్రీకాంత్, ఆర్థిక కార్యదర్శిగా బందుకుల శ్రీనివాస్, సహా అధ్యక్షులుగా గణపతి, రాజు, సప్తగిరి, ఉపాధ్యక్షులుగా రాంకుమార్, కార్యదర్శిగా జక్కుల ప్రియతమ్, ప్రసాద్ ఎన్నికయ్యారు.



వైట్‌ప్లేట్‌తో కూడిన ఈ వాహనం డీఆర్డీవో సీసీడీ. నిబంధనలకు విరుద్ధంగా ఈ వాహనాన్ని అద్దె ప్రాతిపదికన ఆ శాఖలోని ఓ ప్రోగ్రాం అధికారికి వినియోగిస్తూ ప్రతినెలా రూ.33వేల అద్దె తీసుకుంటున్నారు.



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసే ఓ డీపీఎం తన సొంత వాహనాన్నే అద్దె ప్రాతిపదికన వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎల్లోప్లేట్‌తో కూడిన వాహనం వినియోగించాలి. అందుకు విరుద్ధంగా వైట్‌ప్లేట్‌తో కూడిన సొంత వాహనం వినియోగించడం గమనార్హం.



జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళల అభ్యున్నతికి చేయూతనందించాల్సిన కీలకమైన విభాగం స్త్రీనిధి. ఈ విభాగంలో పనిచేసే అధికారి తన సొంత వాహనాన్ని అద్దె ప్రాతిపదికన వినియోగిస్తున్నారు. ఇతరులకు అనుమానం కలగకుండా ఎల్లోప్లేట్‌ను వినియోగిస్తూ ప్రతి నెలా అద్దె పొందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నిబంధనల ప్రకారం ఎల్లోప్లేట్‌తో కూడిన వాటినే అద్దెవాహనాలుగా వినియోగించాలి. వైట్‌ప్లేట్‌తో కూడిన సొంత వాహనాలను వినియోగిస్తున్నట్లు ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. అలాంటివి ఉన్నట్లయితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. సొంత వాహనాలు వినియోగించే వారికి అద్దె చెల్లించకుండా చూస్తాం. –సాయన్న, డీఆర్డీవో

అధికారుల దందా!

- అద్దె ప్రాతిపదికన సొంత వాహనాల వినియోగం
- నిరుద్యోగుల ఉపాధి అవకాశాలు దెబ్బతీస్తున్న వైనం

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ (డీఆర్డీఏ)లో అద్దె వాహనాల దందా విమర్శలకు తావిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక పరిపుష్టి, ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాల్సిన కీలకమైన శాఖ డీఆర్డీఏనే. అందుకే ప్రభుత్వం మరే ఈ ఇతర శాఖలో లేని విధంగా డీఆర్డీఏలో పనిచేసే ప్రతీ జిల్లా ప్రోగ్రాం అధికారి (డీపీఎం)కి అద్దె వాహన సౌకర్యం కల్పిస్తోంది. జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రతి నెలా రూ.33వేల వాహన అద్దె చెల్లిస్తోంది. సొంత వాహనాలు కలిగిన నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూర్చాలనే సదుద్దేశంతో కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని ఆ శాఖలోని కొంత మంది అధికారులు మాత్రం దుర్వినియోగం చేస్తున్నారు. అద్దె వాహనాలకు బదులుగా తమ సొంత వాహనాలనే వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఏడుగురికి అద్దె వాహన సౌకర్యం

డీఆర్డీఏలో పనిచేసే ఆయా విభాగాల జిల్లా ప్రోగ్రాం అధికారులకు వాహన సౌకర్యం కల్పిస్తున్నారు. ఇందులో డీపీఎం మార్కెటింగ్, ఫాం, నాన్‌ఫాం, ఫైనాన్స్, బ్యాంక్ లింకేజీ, ఐబీ, ఏపీఎం పెన్షన్స్ వంటి వారు ఉన్నారు. వీరు జిల్లాలోని ఆయా మండలాల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ ఆయా అంశాల్లో ప్రగతి వేగిరం చేసేలా చూడటంతో పాటు సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ మేరకు సొంత వాహనాలు కలిగిన నిరుద్యోగ యువత నుంచి అద్దె ప్రాతిపదికన వాహనసేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

సొంత వాహనాలకే మొగ్గు..

అధికారులు అద్దె వాహనాలను వినియోగిస్తూ వాటికి డ్రైవర్లను నియమించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా నెలకు 2500 కిలోమీటర్లు తిప్పాలనేది ప్రభుత్వ నిబంధన. జిల్లాలో ఏడుగురు డీపీఎంలతో పాటు స్త్రీనిధి రీజినల్ మేనేజర్‌కు అద్దె వాహన సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే సదరు అధికారులేవరూ అద్దె వాహనాలను వినియోగించలేదని తెలుస్తోంది. అలాగే క్షేత్రస్థాయికి వెళ్లకుండానే వెళ్లినట్లుగా టూర్ డైరీలు క్రియేట్ చేసుకుని బిల్లులు డ్రా చేసుకుంటున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. కొంతమంది అధికారులు తమ వాహనాలను తామే నడుపుకుంటు డ్రైవర్ బిల్లులను సైతం పొందుతున్నట్లు తెలుస్తోంది. వినియోగించే వైట్‌ప్లేట్ వాహనం ఒకటైతే నెలవారీగా అద్దె మాత్రం వారి బంధువులు, స్నేహితుల ఎల్లోప్లేట్ వాహనాల పేరిట సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ప్రభుత్వ వాహనానికి బదులు సొంత వాహనం వినియోగిస్తున్న డీపీఆర్వో



పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నిలిపి ఉంచిన సమాచార శాఖ వాహనం



ప్రభుత్వ వాహనం వద్దట!

- సొంత వాహనానికే డీపీఆర్వో మొగ్గు
- మూలనపడిన సమాచార శాఖ వెహికిల్

కైలాస్‌నగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రచారంతో పాటు కలెక్టర్‌కు సంబంధించి రోజువారీగా నిర్వహించే సమీక్షలు, అభివృద్ధి కార్యకమాలను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చేరవేయడంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిది కీలకపాత్ర. అందుకే ప్రభుత్వం సదరు అధికారికి వాహన సౌకర్యం కల్పిస్తోంది. అయితే కండిషన్‌లో ఉన్న ప్రభుత్వ వాహనాన్ని పక్కనబెట్టి డీపీఆర్వో తన సొంత వాహనం వినియోగించడం విమర్శలకు తావిస్తోంది. కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వ వాహనాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద గుట్టుగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. నిబంధనల ప్రకారం జిల్లాలో కలెక్టర్ పర్యటించే క్రమంలో ప్రభుత్వ వాహనాన్ని వినియోగించాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తున్న డీపీఆర్వో తన సొంత వాహనాన్ని వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఇంధన ఖర్చుతో పాటు డ్రైవర్‌కు జీతభత్యాలు సర్కారు ఖజానా నుంచే పొందడం గమనార్హం. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారి స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

క్లుప్తంగా

ఆగని మొరం తవ్వకాలు



రెబ్బనపల్లి సమీపంలో మొరం తవ్వకాలు

దండేపల్లి: మండలంలో అక్రమ మొరం తవ్వకాలు ఆగడం లేదు. సంబంధిత అధికారులు వాటిని అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని గూడెం, రెబ్బనపల్లి సమీపాల్లో గల ప్రభుత్వ భూముల్లోని గుట్టల్లో దర్జాగా జేసీబీలతో మొరం తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మొరం తవ్వకాలపై సంబంధిత అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

తాండూర్: మండలంలోని మాదారంలో రేషన్ బియ్యాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రేషన్‌బియ్యం కొనడానికి వచ్చిన గజ్జెల నారాయణ వద్ద నుంచి 50 కిలోల బియ్యాన్ని పట్టుకున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆటోను సీజ్ చేసి మాదారం పోలీసులకు అప్పగించామన్నారు. గ్రామంలో 10 మంది మహిళలు రేషన్ బియ్యం కొనడానికి రాగా, రెవెన్యూ అధికారులు వస్తున్నారనే సమాచారంతో పారిపోయారు. అధికారుల నిఘాతో రేషన్ బియ్యం కొనుగోళ్లు ఆగిపోయాయి.

దాడికి దిగిన పది మందికి నోటీసులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీచౌక్‌లో పరస్పరంగా దాడులకు దిగిన పది మందికి నోటీసులు జారీ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 1న దీపావళి పండుగ రోజున టపాసులు కాల్చుతున్న సమయంలో మ్యాక్స్ పికప్ నడుపుతున్న డ్రైవర్ జలీల్ ఖాన్ వాటిపై నుంచి వాహనాన్ని తీసుకెళ్లగా, రాకెట్లు తగిలి పలు దుకాణాల్లోకి చొరబడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. కోపోద్రిక్తులైన ప్రీతం శర్మ, షెట్టి శర్మ, కృష్ణశర్మ, చందన్‌శర్మ, యతేంద్రనాథ్, హితేంద్రనాథ్, శివ వాహన డ్రైవర్‌పై దాడికి దిగారు. దీంతో డ్రైవర్ మరో ఇద్దరు సయ్యద్ అజర్, మహ్మద్ కాషిఫ్‌తో వచ్చి వారితో గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఆదివారం వారికి నోటీసులు జారీ చేసి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

దగ్ధమైన పత్తి



కాలిపోయిన పత్తిని చూపిస్తున్న రైతు

తాంసి: భీంపూర్ మండలం అంతర్గాం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో పత్తి దగ్ధమైంది. రైతు రాకేశ్ ఇంటివద్ద పది క్వింటాళ్లకు పైగా పత్తి పంట నిల్వచేశాడు. పత్తి తీతకు మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీల పిల్లలు టపాసులు కాలుస్తుండగా నిప్పురవ్వ పత్తిపై పడి అంటుకుంది. గ్రామస్తులు నీళ్లతో మంటలార్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే పత్తి, గది అగ్నికి ఆహుతయ్యేదని పలువురు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కొంతమేర పత్తి కాలిపోయింది.

యూఏఈ.. మరో అవకాశం

- వీసా క్రమబద్ధీకరణకు రెండు నెలల గడువు
- క్షమాభిక్ష ద్వారా అపరాధరుసుం లేకుండానే స్వస్థలాలకు..
- ఉమ్మడి జిల్లా వలస కార్మికులకు ప్రయోజనం



గల్ఫ్ దేశాల్లో పనిచేసున్న వలస కార్మికులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వలస కార్మికులకు యూఏఈ మరో అవకాశం కల్పించింది. వీసా గడువు ముగిసి అక్కడ పనిచేస్తున్న అక్రమ వలసదారుల వీసాల క్రమబద్ధీకరణకు రెండు నెలల గడువు పొడిగించింది. గత అక్టోబర్‌కు వీసాల క్రమబద్ధీకరణ గడువు ముగిసినప్పటికీ చివరి వారంలో వేలాది దరఖాస్తులు వచ్చాయి. మరో రెండు నెలలు గడువును అక్కడి ప్రభుత్వం పొడిగించింది. డిసెంబర్ చివరి నాటికి అపరాధ రుసుము లేకుండా స్వదేశానికి తిరిగివచ్చేవారికి క్షమాభిక్ష (ఆమ్నెస్టీ) పథకం వర్తిస్తుందని గల్ఫ్ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

రెన్యువల్ చేసుకోకుండా..

విజిట్ వీసాపై వెళ్లిన కొందరు, కంపెనీ వీసాపై వెళ్లి గడువు ముగిసిన మరికొందరు రెన్యువల్ చేసుకోకుండా అక్రమంగా ఉంటున్నారని అక్కడి ఫెడరల్ అథారిటీ ఫర్ ఐడెంటిటీ, సిటిజెన్షిప్ సంస్థల గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూఏఈ 53వ యూనియన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్షమాభిక్ష పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు చెబుతున్నాయి. తుది గడువు ముగిసినా అక్రమంగా ఉంటున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. వచ్చే జనవరి 1 నుంచి తనిఖీలు తీవ్రతరం చేయనున్నట్లు చెబుతున్నాయి. వీసా గడువు క్రమబద్ధీకరణ లేదా తిరిగి స్వస్థలాలకు వెళ్లేవారు సంబంధిత కార్యాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం నాయకుడు స్వదేశ్ పరికిపండ్ల సూచించారు.

70 వేలకు పైగా కార్మికులు..

దుబాయ్, అబుదాబి, అజ్మన్ షార్జా తదితర ఏడు దేశాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన దాదాపు 70 వేలకు పైగా వలస కార్మికులు ఉపాధి పొందుతున్నారని గల్ఫ్ కార్మిక సంఘాల అంచనా వేశాయి. వివిధ కారణాల రీత్యా వీసా గడువు ముగిసి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు ఉన్నారు. దాదాపు 15 వేల మందికి పైగా వీసా నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నారని చెబుతున్నాయి.

మా బాబును బతికించండి

- ఏడు నెలల చిన్నారికి నిమోనియా
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇషాన్
- వైద్యానికి రూ.10 లక్షల ఖర్చు
- ఆపన్నహస్తం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు



చికిత్స పొందుతున్న ఇషాన్

జన్నారం: ఆడుతూ పాడుతూ ఉండాల్సిన చిన్నారి ఆస్పత్రి పాలయ్యాడు. కూతురు పుట్టిన పదేళ్ల తర్వాత బాబు జన్మిస్తే తల్లిదండ్రులు సంతోషించారు. ఆ ఆనందం ఎంత సేపు నిలువలేదు. ఏడునెలల ఇషాన్ నిమోనియా బారినపడ్డాడు. ఆస్పత్రుల్లో 18 రోజులుగా చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం రూ.10 లక్షల ఖర్చవుతుడడంతో తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. జన్నారం మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన కలీం, సోని దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు. కూతురు పుట్టిన పదేళ్లకు పుట్టిన బాబుకు ఇషాన్ పేరుపెట్టారు. పుట్టిన ఏడు నెలలకే అనారోగ్యం బారినపడ్డాడు. జగిత్యాల, కరీంనగర్ ఆసుపత్రుల్లో చూపించగా నిమోనియా ఉందని, పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. రోజు కూలీ చేసి కుటుంబాన్ని పోషించుకునే తల్లిదండ్రులకు చికిత్సకు పెట్టే స్థోమత లేదు. ఎలాగైన కుమారుడిని బతికించుకునేందుకు హైదరాబాద్‌లోని రేయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించారు. ఐదు రోజులకు రూ.4 లక్షల ఖర్చయింది. చికిత్స కోసం రోజు రూ.80 వేలు ఖర్చవుతుందని మరో 15 రోజులు ఉండాలని వైద్యులు చెబుతున్నారని దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపు



ఇషాన్ (ఫైల్)

కూలీ పనిచేసుకునే తల్లిదండ్రులకు బాబు అనారోగ్యం రూపంలో పెద్ద ఆపద వచ్చింది. కొడుకును బతికించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. జగిత్యాలలో పది రోజులు, కరీంనగర్ ఆసుపత్రిలో మూడు రోజుల అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించారు. అప్పులు తెచ్చి రూ.4 లక్షలు ఖర్చు చేయగా, మరో రూ.10 లక్షల ఖర్చు అయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దాతలు ముందుకొచ్చి సాయం చేస్తే కొడుకు బతికించుకుంటామని వేడుకుంటున్నారు. సాయం చేయదలిచినవారు గూగుల్ పే, ఫోన్ పే నంబర్ సెల్: 85559 80673 నంబర్‌కు నగదు పంపించాలి.


మ్యాట్రిమోని పేరుతో మోసం

- రూ.17 లక్షలు కాజేసిన దంపతులు
- బాధితుడి ఫిర్యాదుతో నిందితులను పట్టుకున్న రామగుండం సైబర్‌క్రైం పోలీసులు

మంచిర్యాలక్రైం: పెళ్లి సంబంధాల(మ్యాట్రిమోని) పేరుతో మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడిని మోసం చేసి రూ.17 లక్షలు కాజేసిన దంపతులను రామగుండం కమిషనరేట్ పరిధిలోని సైబర్ క్రైం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, అదే జిల్లా ముత్తారం మండలం ఏలూరుకు చెందిన సౌజన్య దంపతులు. వీరు ఈజీ మనీ కోసం సోషల్ మీడియాలో మ్యాట్రిమోని పేరుతో ఖాతా తెరిచారు. అందులో అందమైన అమ్మాయిల ఫొటోలు పెడుతూ.. వరుడు కావాలని ప్రకటనలు ఇచ్చేవారు. ఈమేరకు పెళ్లి కాని యువకులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపేవారు. ఇలా మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపారు. అతను దానిని ఆమోదించి వివరాలు తెలుసుకునేందుకు వారు ఇచ్చిన ఫోన్ నంబర్‌లో మాట్లాడారు. ఓ అమ్మాయి తనకు నచ్చిందని, పెళ్లి చేసుకుంటానని తెలిపాడు. దీంతో సదరు దంపతులు ఓ యువతితో నేరుగా మాట్లాడించారు. తనకు కూడా నచ్చావని చెప్పించారు. ఇలా మాటల్లో పెట్టి సంబంధం కుదిరినట్లే అని బురిడీ కొట్టించారు. తర్వాత తన ఆరోగ్యం బాగా లేదని, తన కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగాలేదని వివిధ సందర్భాల్లో డబ్బులు వసూలు చేశారు. పెళ్లవుతుంది కదా అని సదరు యువకుడు కూడా రూ.17 లక్షల వరకు చెల్లించాడు. తర్వాత ఫోన్ చేసినా స్పందించలేదు. స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు రామగుండం సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఫోన్ నంబర్ ఆధారంగా నిందితులను ట్రాప్ చేసిన పోలీసులు వెంకటనాగరాజు, సౌజన్యను అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ఏసీపీ వెంకటరమణ, సీఐ కృష్ణమూర్తిని సీపీ శ్రీనివాసులు అభినందించారు.

గుండెలదురుతున్నాయ్..

- ఆగుతున్న ఊపిరి!
- జిల్లాలో పెరుగుతున్న హృద్రోగ, కాలేయ సమస్యలు
- ఆకస్మిక మరణాల్లో మధ్యవయసుల వారే..
- ఆహారపు అలవాట్లే కారణమంటున్న వైద్య నిపుణులు



నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో హృద్రోగ, కాలేయ సమస్యలు పెరిగిపోతున్నాయి. 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయసులు వారే ఎక్కువగా మృతి చెందడం ఆందోళనలకు గురిచేస్తోంది. ఆహారపు అలవాట్లు మద్యపానం, సరైన వ్యాయామం లేకపోవడం, క్రిమిసంహారక మందులతో పండించిన కూరగాయలే అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

- జిల్లాకేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పదిరోజుల క్రితం ఉదయం విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఛాతీలో నొప్పి అంటూ సోఫాలో పడిపోయాడు. నిమిషాల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయాడు.
- నర్సాపూర్(జి) మండలంలోని నసీరాబాద్ గ్రామానికి చెందిన యువకుడు (36) తన కుటుంబంతో వృత్తిరీత్యా నిర్మల్‌లో నివాసముంటున్నాడు. అతను ఆకస్మాత్తుగా గత శనివారం రాత్రి ఇంట్లో కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కార్డియాక్ అరెస్ట్‌తో హఠాన్మరణం చెందాడని వైద్యుడు తెలిపారు.
- రెండునెలల క్రితం జిల్లాలోని ఖానాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నెలరోజుల సెలవుపై విదేశాల నుంచి వచ్చాడు. ఇంట్లో గృహప్రవేశం జరిగిన మూడో రోజే గుండెపోటుతో కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
- కొన్నినెలలక్రితం నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేట్‌కు చెందిన యువకుడు(39) ఉదయం చాతిలో నొప్పి అంటూ ఇంట్లో పడిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది.
- జిల్లాకేంద్రానికి చెందిన వ్యక్తి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చెకప్ కోసం ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్ష చేయిస్తే కాలేయం 80 శాతం మేర చెడిపోయిందని తేలింది.

ఎన్నో కారణాలు..

ప్రధానంగా గుండె లయ తప్పడానికి ఎన్నో అంశాలు ప్రభావం చూపుతాయి. కొందరిలో గుండె కండరం మందం కావడం, పుట్టుకతో గుండెలో లోపాలు, కర్ణికలు పెద్దగా ఉండడం, జన్యుపరంగా తలెత్తే ఇతర సమస్యలే ఇందుకు కారణమవుతున్నాయి. కండరం మధ్య భాగంలోని కణాలు అతి చురుకుగా స్పందించడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. శరీరానికి రక్తప్రసరణ సరిగా జరగకపోవడంతో తల తిరగడం, స్పృహ కోల్పోవడం, నిమిషాల వ్యవధిలో మరణాలు సంభవిస్తున్నాయి. యువత వ్యాయామం, డ్యాన్స్ చేస్తున్నప్పుడో కుప్పకూలుతున్న ఘటనలు తరచూ సంభవిస్తున్నాయి.

వైద్యులను సంప్రదించాలి



గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఆహార నియమాలు పాటించాలి. ప్రతి ఒక్కరికి ఉదయం నడక, వ్యాయామం, యోగా సాధన చేయాలి. ఏదైన అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలి. శీతాకాలంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎం.ఎస్.ఆదిత్య, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



రాథోడ్ శంకర్ మృతదేహం

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. మండలంలోని షేక్ అహ్మద్‌గూడ కాలనీకి చెందిన నిఖిల్, పారిగాం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌లు ఆదివారం కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వైపు బైక్‌పై వస్తున్నారు. హుడ్కిలిలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ శంకర్(50) కాగజ్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. వేంపల్లి సమీపంలో నిఖిల్ రాంగ్ రూట్‌లో వచ్చి ఎదురుగా ఉన్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాథోడ్ శంకర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా నిఖిల్, శ్రీకాంత్‌లకు గాయాలయ్యాయి. మృతుడి భార్య రాథోడ్ కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన ఆకు లక్ష్మణ్ తన కుమారుడితో కలిసి ఆదివారం బైక్‌పై కనకపూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కనకాపూర్‌కు చెందిన కరిపె రమణయ్య రోడ్డు పక్కనే ఉన్న తన పొలం నుంచి బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆకు లక్ష్మణ్ కాలు విరగగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. కరిపె రమణయ్య తల తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన ఆర్.నాందేవ్(38) గతనెల 31న మృతిచెందాడు. కుటుంబీకులు అనుమానంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖననం చేసిన మృతదేహాన్ని తహసీల్దార్ సమక్షంలో ఆదివారం బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..నాందేవ్ మహారాష్ట్రలోని లక్ష్మీవెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో కూలీగా పనిచేసేవాడు. గతనెల 30న అక్కడి నుంచి ఇంటికి తిరిగిరాగా, మరుసటి రోజు ఇంట్లో మృతిచెందాడు. కుటుంబీకులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. జిన్నింగ్ మిల్లులో మిథున్‌తో గొడవ జరిగిందని సమాచారం రావడంతో ఫిర్యాదు చేశారు. ఆయన మృతికి కారణమై ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేయడంతో పోస్టుమార్టం నిర్వహించినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.



అ'పూర్వ' సమ్మేళనం

తాండూర్ జెడ్పీ పాఠశాల పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

తాండూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో జరిగిన అపూర్వ సమ్మేళన కార్యక్రమానికి ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తీపిగుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

- విష్ణు శివానికేతన్ ఉన్నత పాఠశాలలో 2004--05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సురభి గోదా క్షేత్రగార్డెన్స్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులంతా ఆటపాటలతో సందడి చేశారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చెరువులో దూకి ఒకరు, పురుగుల మందు తాగి ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

చెరువులో దూకి యువకుడు..



గంగాధర్ (ఫైల్)

కుంటాల: మతిస్థిమితం లేని యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన చందులవార్ గంగాధర్ (33), భార్య సరిత భార్యభర్తలు. వీరికి ఒక కుమార్తె ఉన్నారు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న గంగాధర్ మద్యానికి బానిసయ్యాడు. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చేవాడు. దీపావళి పండుగ కోసం భార్య సరిత గత బుధవారం అర్లి(కె) గ్రామంలో తల్లిగారింటికి వెళ్లింది. గంగాధర్ శుక్రవారం రాత్రి బయటికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. ఆదివారం గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య సరిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో మహిళ

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు. ఆమె కథనం ప్రకారం..మండలంలోని కుచులాపూర్ పంచాయతీ పరిధిలోని మల్రిపల్లె గ్రామానికి చెందిన కొడప లక్ష్మీబాయి (38) గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసైంది. ఆదివారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. భర్త లక్ష్మన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చదువుకు దూరమయ్యానని యువతి..



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సాయికుమార్



సీమల జయశ్రీ (ఫైల్)

పెంబి: చదువుకు దూరమయ్యాయని మనస్తాపంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయి కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన సీమల సోమవ్వ–లింగన్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. చిన్న కూతురు జయశ్రీ(17) రెండేళ్ల క్రితం ఇంటర్ పరీక్షల సమయంలో అపెండిక్స్ సర్జరీ కావడంతో పరీక్షలు రాయలేదు. దీంతో ఇంటి వద్ద ఉంటూ తల్లిదండ్రులతో వ్యవసాయ పనులకు వెళ్లేది. గత కొంతకాలంగా చదువుకు దూరమయ్యానని తల్లిదండ్రులకు చెబుతూ బాధపడేది. ఎప్పటిలాగా జయశ్రీ శనివారం తల్లి సోమవ్వతో కలిసి పత్తి చేనుకు వెళ్లి ఇంటికి వచ్చింది. పురుగుమందు వెంట తీసుకుని మరో చేను వద్ద తాగింది. గమనించిన జయశ్రీ చిన్నాన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. తండ్రి లింగన్న ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడు..



భరత్(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అంగడిబజార్‌కు చెందిన కోయల్కర్ భరత్(28) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. భరత్ బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం పలుమార్లు సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యేవాడు. ఎలాంటి ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తితో శనివారం రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి బాబాయ్ మధు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కలప పట్టివేత



పట్టుకున్న ఆటో, కలపతో అటవీ సిబ్బంది

కడెం: మండలంలోని నవబ్‌పేట్ సమీపంలో అక్రమంగా కలప తరలిస్తున్న ఆటోను అటవీ సిబ్బంది ఆదివారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో గీతారాణి తెలిపారు. పక్కా సమాచారంతో లక్ష్మీపూర్ ఎఫ్‌బీవో నుమానుద్దీన్ బేస్ క్యాంప్ సిబ్బందితో కలిసి ఆటోను పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారన్నారు. పట్టుబడిన కలప దుంగల విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని తెలిపారు.

ఇంట్లో చోరీ

ముథోల్: మండల కేంద్రంలోని కోటగల్లీలో ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. బాసర మండల కేంద్రానికి ఫర్జాన..కొన్నిరోజులుగా ముథోల్‌లోని కోటగల్లీలో అద్దె ఇంట్లో ఉంటోంది. శనివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నిజామాబాద్ వెళ్లింది. రాత్రి 10 గంటలకు వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో రూ.80 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలను దొంగలు ఎతుకెళ్లారని బాధితురాలి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన సంజీవ్ (33) గతవారం క్రితం అదృశ్యమైనట్లు కుటుంబీకులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ వ్యక్తి ఆదివారం జైనథ్ మండలంలోని పెండల్‌వాడలో శవమై కనిపించాడు. వాగు సమీపంలో మృతిచెంది ఉండగా, స్థానికులు గమనించి జైనథ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.